# దర్శనం

పుట్టి బుద్ధెరిగేక తిరుపతి కొండెక్కనేలేదు గోపాలకృష్ణ!

పెళ్ళై పదేళ్ళయినా సంతానం కలుగకపోవడంతో ఓ వంశాకురం పుడితే... కొండ కొస్తామని భార్యాభర్తలిరువురూ మొక్కుకున్నారు.

గోపాలకృష్ణ దంపతుల కలలు పండి కృష్ణవేణి నీళ్ళోసుకుంది! తాను తండ్రి కాబోతున్నందుకు మురిసిపోయారిద్దరూ!

ఏడుకొండలవాడికి ముడుపుకట్టి నెల తిరక్కముందే తాను తల్లి కాబోతోందని గ్రహించగలిగింది కృష్ణవేణి.

మూడవనెలలో గైనకాలజిస్ట్ కృష్ణవేణిని చెకప్‌చేసి కడుపుతో వున్న విషయం కన్ఫర్మ్ చేయటంతో గోపాలకృష్ణ ఎగిరి గంతేసాడు.

ఆఘమేఘాలమీద తాను తండ్రి అవబోతున్న విషయం ఇటు పేరెంట్స్‌కి అటు ఇన్లాస్‌కి తెలీపర్చటంతో ఇరువైపులవారూ వారం తిరక్కుండానే గోపాలకృష్ణ ఇంటికొచ్చి వాలేరు.

ఏడవనెల రాగానే కృష్ణవేణిని తాము తీసుకెళ్ళి సీమంతం చేస్తామనే విషయం అత్తమామల నోటినుండి రాగానే... నో... నో... నో! మీది వైద్యుడైనా లేని పల్లెటూరు. పురిటికి పుట్టింటికి ససేమిరా పంపనంటూ భీష్మించాడు. అదీగాక... పురుడు సిటీలోనే పేరున్న మెటర్నిటీ నర్సింగ్‌హోంలోనే పోయిస్తానన్నాడు... డబ్బెంత ఖర్చు అయినా తనకేం ఇబ్బంది లేదన్నాడు. ఇంకా ఏవేవో చాలా విషయాలు నిక్కచ్చిగా కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడేడు.

సీమంతం అయ్యాక తిరిగి పంపించేస్తామని అత్తమామలు చెప్పటంతో గోపాలకృష్ణ మెత్తబడ్డాడు.

ఏడోనెల్లో కృష్ణవేణి పుట్టింటికెళ్ళి సీమంతం కార్యక్రమం పూర్తి చేసుకురాగానే ఉభయులూ కొండకెళ్ళి రావాలనేది గోపాలకృష్ణ ఆలోచన!

నెలలు నిండబోతున్న శ్రీమతిని తిరుపతికి తీసుకెళ్లటం వరకూ బాగానే వుంది ఆలోచన! ఆపైన గంటల తరబడి క్యూలో కృష్ణవేణి నిలబడాలంటేనే... అసలు సమస్య మొదలవుతుంది! భార్య ఓపిక చేసుకుని నిలబడగలదా? అనేది ప్రశ్న.

ప్రపంచలోదేన్నైనా జయించవచ్చేమోగానీ... కొండకెళ్ళి వేంకటేశ్వరుని దర్శనం చేసుకోవాలంటే మాత్రం రోజులకొద్దీ రద్దీతో కిటకిటలాడే క్యూలో నిలబడాలంటే వెంటనే ధర్శనం లభించక చావుకొస్తుందనిపించింది గోపాలకృష్ణకి!

అదీ నిజమే! ఎంత టిక్కెట్టు దర్శనమైనా కొన్ని గంటలైనా నిలబడక తప్పదు. అలాంటిది... ధర్మ దర్శనం మాటంటే చెప్పనే అక్కర్లేదు.

భయం మనసులో వున్నా... ఆ దేవుడు అనుగ్రహించబట్టే కదా తాను తండ్రి కాబోతున్నాడు... అంతా స్వామి దయ!... కాబట్టి ఎన్ని కష్టాలు పడినా సరే... వెళ్ళి శ్రీనివాసుని దర్శనం చేసుకోకతప్పదనే నిర్ణయానికొచ్చాడు.

★★★★★

తలవని తలంపుగా ఒకరోజు న్యూస్ పేపర్లో తి.తి.దే. వారు గర్భిణీ స్త్రీల సదుపాయం కొరకై నేరుగా ద్వార ప్రవేశం నుండే గుడిలోనికి పంపి... స్వామి దర్శనం సులభతరం చేస్తున్నారనే విషయం చదివి 'హమ్మయ్య' అంటూ గట్టిగా ఊపిరి పీల్చి వదిలాడు.

ఇక కృష్ణవేణి క్యూలో గంటల తరబడి నిలబడాల్సిన సమస్య తీరినట్టయింది!.

ఏది ఏమైనా... తి.తి.దే. వారి నిర్ణయానికి జోహారులర్పించాడు గోపాలకృష్ణ!

కృష్ణవేణి ప్రాబ్లమ్ సాల్వయింది. బాగానే వుంది. మరి... వెంట వున్న భర్తని గర్భిణీ భార్యకి తోడుగా లోనికి ముఖద్వారంనుండి పంపుతారో లేదో అర్థంకాలేదు. ఒకవేళ దేవస్థానంవారు భర్తను సైతం గర్భిణీ భార్య వెంట లోనికి దర్శనార్థమై పోనివ్వకపోతే...!

కృష్ణవేణిని షార్ట్ కట్‌లో లోనికి పంపించి... తాను క్యూలో నిలబడాల్సి వస్తుంది! ఓరి భగవంతుడా నాకేది దారి? శ్రీమతిని వంటరిగా లోనికి పంపేటందుకు గోపాలకృష్ణ మనసు వప్పుకోలేదు. మరి... ఈ ప్రాబ్లమ్‌కి సొల్యూషనేమిటన్నదే వేధిస్తోంది.

ఇంతలో మహత్తరమైన ఐడియా ఒకటి గోపాలకృష్ణ మస్తిష్కంలో చటుక్కున ఫ్లాషైంది!

★★★★★

గోపాలకృష్ణ అంటే అల్లా టప్పా ఏం కాదు. పేరు ప్రఖ్యాతులార్జించిన రంగస్థల నటుడు!

పువ్వు పూయగానే పరిమళిస్తుందన్న సామెత అతనిపట్ల నిజమై రుజువైంది.

హైస్కూల్లో చదివే రోజుల్లో ఆడవేషం కట్టి నాటకం వేసి అందరిచేత సెభాష్ అనిపించుకున్నాడు.

కాలేజీ చదువుకొచ్చాక డిగ్రీలో మూడేళ్ళూ గోపాలకృష్ణే ఉత్తమనటి నటుడు బహుమతులను కైవసం చేసుకున్నాడు.

ఆడవేషంలో గోపాలకృష్ణని చూచి ఎవ్వరూ పోల్చుకోలేకపోయారు. ప్రిన్సిపాల్ సైతం నిర్ఘాంతపోయి ముక్కున వేలేసుకున్నాడు. అదీ! అతని టాలెంట్!

అటు సాంఘిక నాటకాలు... మరోవైపు పౌరాణిక నాటకాలలో ఆడమగ పాత్రలు పోషిస్తూ ఎన్నో నాటక పరిషత్తుల్లో బహుమతులు కొట్టేశాడు.

ఆడవేషంలో గోపాలకృష్ణ నటనాచాతుర్యానికి అచ్చెరువొందిన గౌరవనీయ ముఖ్యమంత్రి స్వయంగ పదివేల రూపాయల క్యాష్ బహుమతితో అతడిని స్టేజిమీద సత్కరించాడు. అదే సంవత్సరం ఉత్తమ రంగస్థల పౌరాణిక నటిగ ప్రభుత్వంనుండి బంగారునంది అందుకోవటం

గోపాలకృష్ణ నటనావైదుష్యానికో మైలురాయి అయింది.

అనాటి'స్థానం' వారి దగ్గర్నుంచి ఈనాటి 'బుర్రా' వారి వారకు స్త్రీ పాత్రలు ధరించిన మగవారి సరసన గోపాలకృష్ణ సముచితస్థానాన్ని సంపాదించుకోగలగటం అదృష్టంగా భావిస్తాడు.

ఒకసారి శ్రావణ శుక్రవారం నాడు పేరంటానికి మేకప్ చేసుకుని విగ్గు పెట్టుకుని తల్లి పట్టుచీరొకటి కట్టుకుని అమె వెంట ఎదురింటి పిన్నిగారింటికి తనూ వెళ్ళాడు.

ఆడవేషధారణలో వున్న గోపాలకృష్ణని అక్కడి ముత్తైదువలెవరూ గుర్తించకపోవటం చూచి పక్కనే వున్న తల్లి ఆశ్చర్యపోయింది.

కాళ్ళకు పసుపు రాయించుకుని... బుగ్గలకు చందనం... నుదుటన బొట్టు పెట్టించుకుని ఆ పేరంటంలో మిగతా స్త్రీలతో బాటు వాయనం పుచ్చుకుని ఇంటికొచ్చాక తల్లి దిష్టి తీసింది కొడుక్కి!

'ఒరేయ్ కృష్ణా! నిన్నిట్లా ఆడవేషంలో చూస్తూంటే.... నీకు నా దిష్టే తగిలేట్టుంది! నా కడుపున ఆడపిల్ల పుట్టకపోయనే అనే దిగులు నిన్నీ వేషంలో చూస్తూంటే తీరిందిరా అబ్బీ..' అంది తల్లి సులోచనమ్మ.

'అవునే! వాడెవరనుకున్నావ్?- నా కొడుకు! తాతల తండ్రుల కాలంనుంచీ నాటకాల పట్ల ఆపేక్ష, రంగస్థల నటుడిగా రాణింపు మా వంశంలోనే వుంది!... ఆడవేషంలో వున్న గోపాలకృష్ణని చూస్తూ గర్వంగ మీసం మెలేశాడు బాపిరాజు.

బాపిరాజు సైతం పౌరాణిక నాటకాలలో దిట్ట! పద్యనాటకాల్లో అనేక రకాల వైవిధ్యభరితమైన వేషాలు ధరించి సెభాష్ అన్పించుకున్న మహానటుడు!

వారసత్వ సంపదగా... నాటకాభినయం గోపాలకృష్ణకీ అబ్బింది!

చేస్తోంది ఎ.జీ. ఆఫీసులో ఉద్యోగమే అయినా ఒక్కక్షణం తన సీట్లో అవుపించడు. ఎప్పుడూ ఏదో నాటకం రిహార్సల్ అంటూ బిజీగా తిరుగుతుంటాడు. పై అధికారులకు సైతం అతనంటే ఎంతో అభిమానం... ప్రేమ వుండడంతో అతడిని ఎవ్వరూ పల్లెత్తు మాటనరు. ప్రతిభగల నటుడు కావటం మూలాన బహుమతులతోబాటు డిపార్టుమెంట్‌కి కీర్తి ప్రతిష్టలనూ ఆర్జించిపెట్టాడు. అదీ అసలు సంగతి!!

గోపాలకృష్ణకి పెళ్ళిచూపుల తంతు కూడా భలే సరదాగా జరిగింది. ఆ విషయం గుర్తుకొచ్చినప్పుడల్లా ఇంట్లో వారంతా పొట్టచెక్కలయ్యేట్టు నవ్వుకుంటూ వుంటారు.

అమ్మాయిని చూడటానికని బాపిరాజు దంపతులు ఆడవేషంలో వున్న గోపాలకృష్ణని వెంట బెట్టుకుని బయల్దేరారు.

ఆడపిల్ల తండ్రి కారు దిగుతున్న బాపిరాజు గారిని వెంటవున్న వారి శ్రీమతి సులోచనమ్మగారినీ సాదర ఆహ్వానం పలికి... పెండ్లికుమారుని కోనమై దిక్కులు చూస్తూండడం... బాపిరాజు కనిపెట్టి 'మావాడు తర్వాత వస్తానన్నాడు. మరో పదినిముషాల్లో

వాడిక్కడుంటాడు... మీరేం కంగారు పడకండి... పదండి లోపలికి వెడదాం...' అంటూ చమత్కారంగ మాట్లాడాడు.

బాపిరాజు దంపతుల వెంట చుడీదార్ డ్రెస్‌లో వున్న గోపాలకృష్ణని చూస్తూ 'ఈ అమ్మాయి ఎవరూ?... మీకు ఆడసంతానం లేదని చెప్పినట్టు గుర్తు" అడిగేడు పిల్లతండ్రి.

'ఈ అమ్మాయి మా పక్కింటి పిన్నిగారి ఏకైక కుమార్తె... మాతో వస్తానని సరదా పడితేనూ... వెంటబెట్టుకొచ్చాం...' అంటూ నవ్వేసింది సులోచనమ్మ.

అందరూ సోఫాల్లో కూర్చుని ఆమాట ఈమాట ముచ్చటించుకున్నాక 'మీ అమ్మాయిని రమ్మనండి...' అంది సులోచనమ్మ.

'అబ్బాయిని కూడా రానివ్వండి వదినగారూ' బంధుత్వాన్ని కలుపుతూ అంది అక్కడే వున్న పిల్ల తల్లి.

'మీకా భయమేమీ అక్కర్లేదు. పిల్లని మేం చూచి ఓ.కే.చేస్తే వాడు కాదనడు. యస్సనేస్తాడు...' అన్నాడు బాపిరాజు.

'అమ్మాయికైనా అబ్బాయిని చూడాలని వుంటుంది కదా...' నసిగేడు పిల్ల తండ్రి.

'మంచి ఘడియలు దాటిపోకముందే ఈ తంతు పూర్తి అవటం మంచిది. వాడొచ్చేసరికి లేటవచ్చు! అందుకే అమ్మాయిని తీసుకొస్తే బావుంటుందని అంటున్నాను...' నటిగేడు బాపిరాజు.

వాళ్ళమాటలు వింటూ అప్పుడప్పుడు వారి ముఖాల్లోకి ఆడచూపులు చూస్తూ... ముసిముసిగా నవ్వుతూ మౌనంగా వుండిపోయాడు అమ్మాయి పాత్ర పోషిస్తున్న గోపాలకృష్ణ.

కాదూ కూడదని మరీ బిర్రబిగదీసుకుంటే మగపిల్లవాడి 'పేరెంట్స్' ఎక్కడ బాధపడిపోతారోని పిల్ల తల్లి ఇంట్లోకి వెళ్ళి కూతురిని వెంటబెట్టుకొచ్చింది.

పిల్లని చూడగానే గోపాలకృష్ణ ముఖం సంతోషంతో విప్పారింది. అందంగా కుందనపు బొమ్మలా వున్న ఆ పిల్లని చూస్తూ 'బేబీ నీ పేరేంటి...?'. సోఫాలోంచి లేచి వచ్చి ఎదురుగా చాపమీద కూర్చున్న అమ్మాయిని సమీపించి పక్కనే కూర్చుంటూ భుజం మీద చేయి వేసి మరీ అడిగేడు (గింది) గోపాలకృష్ణ.

'సౌమిత్రి' అని తనపేరు చెప్పి నవ్వింది.

'నువ్వు చాలా బ్యూటిఫుల్‌గా వున్నావ్...' ప్రశంసించాడు (చింది) గోపాలకృష్ణ.

తలపక్కకు తిప్పిన సౌమిత్రి తదేకంగ గోపాలకృష్ణ కేసి చూచి ఛటుక్కుని తలదించుకుని 'మీరూ అందంగానే వున్నారు...' అనేసింది.

ఇంతలో అందరికీ కాఫీలొచ్చినయ్!

'మనిద్దరం వన్ బై టు తాగుదామా...' సాసర్లోకి కప్పులో కాఫీ వొంపి అందివ్వబోయాడు

(ఇంది) గోపాలకృష్ణ.

'నువ్వు సిగ్గుపడకు! పెండ్లి కుమారుడు మా ఇంటిపక్కవాళ్ళబ్బాయ్! మోస్ట్ హేండ్సమ్ ఫిగర్! నీకు తప్పక నచ్చుతాడు... ఇకనుండి మనిద్దరం క్లోజ్‌ఫ్రెండ్స్‌ము కదా...' అంటూ సాసరు తానే చేత్తో పట్టుకుని సౌమిత్రి పెదాలకు తాకించి బలవంతాన తాగించటం పిల్ల తండ్రి తల్లి ఇతర బంధువులు చూచి కొంచెం ఇబ్బందిగ ముఖాలు పెట్టారు.

'అబ్బాయి రానేలేదు...' గొణిగేడు సౌమిత్రి తండ్రి.

'వస్తాడండీ... వస్తాడు. మీరేం దిగులు పడకండి...' ధైర్యం చెప్పాడు బాపిరాజు.

'సౌమిత్రీ! పెండ్లికుమారుడు వచ్చేలోగా మనిద్దరం కాస్సేపలా... గార్డెన్‌లోకి వెళ్ళి చూసొద్దామా...' అంటూ కంపెల్ చేసి ఆమెను తనవెంట నడిపించాడు గోపాలకృష్ణ.

ఆ సన్నివేశం చూచి బాపిరాజు దంపతులు ముసిముసిగా నవ్వుకున్నారు.

గార్డెన్లోకి వెళ్ళి అక్కడున్న ఛైర్లో కూర్చోబోతూ 'ఐ లైక్ యూ వెరీమచ్...' ఠక్కున సౌమిత్రి బుగ్గలపై ముద్దాడేడు గోపాలకృష్ణ.

ఆ చర్యకి సౌమిత్రి బిత్తరపోయింది!

'ఎడ్వాన్స్‌గా కిస్ ఇచ్చానంటే... నువ్వు నాకు నచ్చినట్టే...' అంటూ కన్నుగీటి సౌమిత్రిని తన కౌగిట్లో బంధించాడు.

పరిస్థితి బోధపడక 'ఛీ! ఇదేం పాడుపని...' అంటూ ముఖం చిట్లించి దూరంగా జరిగి భయంతో వణికిపోసాగింది సౌమిత్రి.

'భయపడకు డార్లింగ్. నేనే పెండ్లి కుమారుడు గోపాలకృష్ణని! నిన్ను ఆట పట్టించాలనే ఈ వేషంలో వచ్చాను...' విగ్గు తీసి అన్నాడు.

పెళ్ళిచూపులు ఆవిధంగా సుఖాంతమై... వారి వివాహానికి దారితీసింది!

★★★★★

సౌమిత్రి సీమంతానికి పుట్టింటికెళ్ళి తిరిగొచ్చేలోపు తిరుమల కొండ ప్రయాణానికి గోపాలకృష్ణ ముహూర్తం పెట్టేయటం పూర్తయింది.

టు-టైర్ ఎ.సి.లో తిరుపతి భార్యాసమేతంగా చేరుకుని టాక్సీ చేసుకుని తిరుమల కొండపైకి వెళ్ళి సెంట్రల్ రిసెప్షన్ వద్ద ఆగి పెయిడ్ కాటేజి బుక్ చేసి డబ్బు కట్టి అటునుండి అదే టాక్సీలో అక్కడికి చేరుకున్నాడు.

కాస్సేపు రిలాక్సైయిన ఇద్దరూ ఎదురుగావున్న కాఫీ హౌస్‌లో హాట్‌గా కాఫీ తాగి మళ్ళీ వెనక్కు వచ్చి కాటేజ్ ముందు పేము కుర్చీల్లో కూర్చుని కొండపై వీచే చల్లని గాలిని పీలుస్తూ... చుట్టూగల అందాలను తిలకిస్తూ కొద్దిసేపు మైమరిచి వుండిపోయారు.

'అవునండీ!... మహాద్వార దర్శనం ద్వారా వెళ్ళేటందుకు నాకొక్కదానికే వీలౌతుంది.

వెంట వున్నవారెవ్వరినీ లోనికి పంపరు కదా!... మరి మీ సంగతేం ఆలోచించారు?- మీరు వెంట రాకుండా నేనొక్కదాన్నీ వెళ్ళను...' సౌమిత్రి తన మనసులో గల అసంతృప్తిని తెలియచేసింది.

'యూడోన్ట్ వర్రీ! నేను అంతా ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చాను...' చిద్విలాసంగ నవ్వాడు గోపాలకృష్ణ.

'బీ సీరియస్! ఈ సమస్యని అధిగమించటం ఎలాగాని వర్రీ అవుతుంటే మీకంతా కామెడీగానే వుంటుంది...'

'మరో కొద్దిగంటలు వెయిట్ అండ్ సీ డార్లింగ్- ఇప్పుడే చెప్తే సస్పెన్స్ పోతుంది...' కూర్చున్నవాడల్లా లేచి 'కాసేపు అట్లా తిరిగొద్దాంరా...' అనటంతో ఇద్దరూ నడిచారు.

ఆ రాత్రి ప్రశాంతంగ తెల్లారింది. సూర్యోదయానికి ముందే లేచి ఇద్దరూ హాట్ వాటర్ బాత్ చేసారు. సౌమిత్రి దర్శనానికి వెళ్ళే ప్రయత్నంలో ముస్తాబవుతోంది.

నిలువుటద్దంముందున్న స్టూలు మీద కూర్చుని వెంట తెచ్చుకున్న మేకప్ కిట్‌తో... విగ్గు పెట్టుకుని ఆడ మేకప్ వేసుకుని తనూ చీరె సింగారించే ప్రయత్నంలో వుండి 'వన్ మినిట్ నేను రెడీ అవుతున్నాను' అన్నాడు గోపాలకృష్ణ.

ఆడ గెటప్‌లో వున్న భర్తని చూచి నివ్వెరపోయి 'ఇదా మీ ధైర్యం... అంతా బాగానే వుంది... కానీ గర్భిణీ స్త్రీలకి మల్లే మీ ఉదరం ఎత్తుగా కన్పించటలేదు కదా?-' క్వశ్చన్ చేసింది సౌమిత్రి.

'డోన్ట్ వర్రీ... ఇదిగో కాటన్ పాడ్!' అంటూ దాన్ని పొట్టమీద అన్చి జారకుండా తాళ్ళతో బిగుతుగా కట్టుకున్నాడు.

'ఇక పోదాం నడు...' అనటంతో ఇద్దరూ బైటకొచ్చి కాటేజీకి తాళం పెట్టారు.

గోపాలకృష్ణ సౌమిత్రి ఇద్దరు గర్భిణీస్త్రీలూ నడుచుకుంటూ మహాద్వారం సమీపించగానే అక్కడి తితిదే సెక్యూరిటీ వారు అడ్డు చెప్పకుండా లోనికిపోనిచ్చారు.

ఒక్కగంటలో స్వామివారి దర్శనం చేసుకుని హుండీలో మొక్కుబడి తాలూకు ముడుపులు వేసి... అటుపై ప్రసాదాలు స్వీకరించి మెల్లగా నడుచుకుంటూ టెంపుల్ ప్రాంగణం దాటి బైటికొచ్చారు.

'చూశావా డియర్! నా తఢాకా!... నేనంటే ఏమిటో ఇప్పటికైనా అర్థమైందా?-' మూతిన లేని మీసం మెలెయ్యబోయాడు.

'తి.తి.దే. వారిని మోసగించినా... మీ నిజస్వరూపం తెలిసిన ఆ శ్రీనివాసుడు దగాచేసి దర్శనం చేసుకున్నందుకు మిమ్మల్ని క్షమించడు...' వెంట నడుస్తూ అంది సౌమిత్రి.

ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు!

- సమాప్తం -